డోలక్ వాయించడంలో దిట్ట..

- రాణిస్తున్న తండ్రీకొడుకులు
- శివరామకృష్ణ భజన మండలి ఏర్పాటు
- పలు ప్రశంస పత్రాలు స్వీకరణ

మొగుళ్లపల్లి: వంశపారంపర్యమైన వృత్తిని నమ్ముకున్నారు. డోలక్, తబలా వాయిస్తూ అందరి ప్రశంసలు అందుకుంటున్నారు మండల కేంద్రానికి చెందిన తండ్రీకొడుకులు రాజసాహెబ్, ఖలీల్. ముస్లిం కుటుంబమైనప్పటికీ కళారంగంలో రాణిస్తున్నారు. స్థానికులతో కలిసి శివరామకృష్ణ భజన మండలి స్థాపించారు. భజనలు, పాటలు పాడడంతో పాటు తబలా, డోలక్ వాయిద్యకళాలలో రాణిస్తూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో ఎక్కడ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించిన వీళ్లకు ఆహ్వానం అందుతోంది. కరీంనగర్‌లో అన్నమయ్య చారిటబుల్ అకాడమీ, పరకాలలో రంగస్థల పద్యనాటక యక్షగాన కళ పోటీల్లో తబలా, డోలక్‌తో పాటు కాంగో వాయిద్య కళాకారులుగా ప్రతిభను చాటారు. కాగా, రాజసాహెబ్ హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో భాషా సాంస్కృతిక శాఖ నిర్వహించిన పోటీల్లో ఉత్తమ డోలక్ మాస్టర్‌గా ప్రశంస పత్రాన్ని అందుకున్నాడు. తెలంగాణ ఉద్యమ సమయంలో పలు సభలకు వెళ్లి డోలక్ వాయించి తెలంగాణ వాదుల్లో ఉత్సాహం నింపారు. రాజసాహెబ్ తండ్రికి కూడా తబాలలో ప్రవేశం ఉంది. వారసత్వంగానే తమకు ఈ కళ అబ్బిందని కళనే నమ్ముకొని బతుకుతున్నామని వారు తెలుపుతున్నారు. అలాగే ఇతరులకు వాయిద్యకళను నేర్పిస్తున్నామని పేర్కొంటున్నారు.


ప్రశంస పత్రం అందుకుంటున్న ఖలీల్(ఫైల్)


ప్రశంస పత్రాలతో రాజసాహెబ్, ఖలీల్

వైభవంగా తిరుకల్యాణ మహోత్సవం


తిరుకల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు


స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పిస్తున్న సాంబశివరెడ్డి

వెంకటాపురం(కె): మండల కేంద్రంలో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి తిరుకల్యాణ మహోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. పక్క రాష్ట్రమైన ఛత్తీస్‌గఢ్, ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులకు భగవాత్ సత్య సాయిభజన మండలి ఆధ్వర్యంలో తాగు నీటి సౌకర్యం కల్పించారు. బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ఆటో యూనియన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. స్వామి వారిని జాతీయ మిర్చి టాస్క్ ఫోర్స్ సభ్యుడు సాంబశివరెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకొని పట్టు వస్త్రాలను సమర్పించారు.

క్లుప్తంగా

సబ్‌స్టేషన్ పీటీఆర్‌కు మరమ్మతులు



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో వేసవి దృష్ట్యా సబ్‌స్టేషన్‌లోని పీటీఆర్‌కు ఎన్పీడీసీఎల్ ఇంజనీర్లు, సిబ్బంది శుక్రవారం మరమ్మతులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో డీఈఈ పాపిరెడ్డి, ఏడీఈ నాగరాజు, ఏఈ శ్రీకాంత్, లైన్ ఇన్‌స్పెక్టర్ సదానందం, సిబ్బంది పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత



టేకుమట్ల: మండలంలోని రామకిష్టాపూర్(వి) గ్రామానికి చెందిన ఎంబాడి నాగరాజు ఇటీవల సెల్‌ఫోన్‌ను పోగొట్టుకుని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్‌ను రికవరీ చేసి ఎస్సై దాసరి సుధాకర్ ఆదేశాల మేరకు బాధితుడికి శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై దాట్ల కుమారస్వామి, కానిస్టేబుళ్లు లత, దినేష్, తదితరులు ఉన్నారు.

దీక్షకు మద్దతు



కాళేశ్వరం: ఎస్సీ వర్గీకరణ తర్వాతనే నియామకాలు చేపట్టాలని నాలుగు రోజులుగా ఎమ్మార్పీఎస్ నాయకులు చేపట్టిన నిరసనకు ఏకలవ్య సంఘం సభ్యులు శుక్రవారం మద్దతు ప్రకటించారు. సంఘం నాయకుడు సుల్తాన్ సుధాకర్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వర్గీకరణ చేట్టాలని పేర్కొన్నారు. బెల్లంపల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో వార్షికోత్సవం



కాటారం: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో గురువారం రాత్రి నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలు అలరించాయి. పదవ తరగతి విద్యార్థులు వారి తల్లిదండ్రులకు పాదపూజ చేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

'చర్య తీసుకోవాలి'

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం సూరారం గ్రామ కార్యదర్శి అంజలిపై చర్య తీసుకోవాలని చల్లా రామ్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామంలో నూతన ఇళ్ల నిర్మాణాల పత్రాలను గ్రామ పంచాయతీలో నమోదు చేయకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుందని ఆరోపించారు. ఎంపీఓకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని తెలిపారు. పంచాయతీలోని రికార్డులు పరిశీలించి ఆమెపై చర్య తీసుకోవాలని కోరారు.

సన్మానం



ఏటూరునాగారం: నీరుకుళ్ల సినిమా యూనిట్‌ను బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహరావు శుక్రవారం సన్మానించారు. సినిమా యూనిట్ సభ్యులు మండల కేంద్రంలోని లక్ష్మీనర్సింహరావు ఇంటికి చేరుకొని చిత్ర పరిశ్రమలో ఉన్న విశేషాలను ఆయనతో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రదీప్‌రావు, భాస్కర్, రఘు, సినిమా ఆర్టిస్టులు ప్రభ, జూనియర్ లోబో, సింగర్ విష్ణు, రైటర్ నర్సింహ పాల్గొన్నారు.

ఒకరికి గాయాలు

ఆత్మకూరు : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని నీరుకుళ్ల క్రాస్‌రోడ్ వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం .. నీరుకుళ్లకు చెందిన కాకాని శ్రీధర్, పెంచికలపేటకు చెందిన ఆకునూరి శ్రీకాంత్ ప్రయాణిస్తున్న బైక్‌లు ఎదురెదురుగా ఢీ కొనడంతో శ్రీధర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అతడిని వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

శాయంపేట : మత సామరస్యానికి ప్రతీక రంజాన్ పండుగ అని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఉపవాసంతో ఉన్న ముస్లింలకు మండల కేంద్రంలోని మదీనా మజీదులో శుక్రవారం ఇఫ్తార్ ఏర్పాటు చేయగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఉదయం నుంచి కఠోర ఉపవాసంతో ఉంటున్న ముస్లింల భక్తి గొప్పదని కొనియాడారు. ఇఫ్తార్‌తో మనుషులంతా సోదరభావంతో ఉండాలనే సందేశం అందుతుందని అన్నారు. వేసవి ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ముస్లింలు తగు జాగ్రత్తలు తీసుకుంటూ ఉపవాస దీక్షలో పాల్గొనాలని సూచించారు. అనంతరం ముస్లింలు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావును శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మత పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే

మండలంలోని కొప్పుల గ్రామంలో గల పెద్దమ్మతల్లి గుడి 6వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పెద్దమ్మతల్లి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పెద్దమ్మతల్లి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నారు. కొప్పుల గ్రామ అభివృద్ధికి తనవంతుగా సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. అనంతరం రాష్ట్ర ప్రజలకు హోళీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

మండల కేంద్రానికి చెందిన బాసాని కైలాసం కనకలక్ష్మి, బాసాని రమాదేవి జ్ఞాపకార్థం తెలంగాణ రాష్ట్ర వినిమం వేజెస్ అడ్వైజరీ సభ్యుడు బాసాని చంద్రప్రకాశ్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు శుక్రవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయని, ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.


ఇఫ్తార్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

జీపీ భవనాల నిర్మాణమెప్పుడో?

స్థల సేకరణలో జాప్యం
- ఏళ్లు గడుస్తున్నా ముందుకు కదలని పనులు

వెంకటాపురం(కె): మండలంలో తొమ్మిది గ్రామ పంచాయతీలు ఉండగా కొత్తగా మరో తొమ్మిది కలుపుకొని మొత్తం 18 పంచాయతీలు ఉన్నాయి. కాగా, రెండు పాత పంచాయతీ భవనాలు శిథిలావస్థకు చేరుకోగా వాటితో పాటు కొత్త పంచాయతీలకు భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వం నుంచి 2022 సంవత్సరంలో ఒక్కో పంచాయతీ భవన నిర్మాణానికి రూ.22లక్షల నిధులు మంజూరు చేసింది. నిధులు మంజూరై సంవత్సరాలు గడుస్తున్నా భవనాలను మాత్రం నిర్మించడం లేదు. దీంతో కొత్త పంచాయతీల నిర్వహణ ప్రభుత్వ భవనలు, కమ్యూనిటీ హాళ్లు, ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్నారు.

ముందుకు సాగని పనులు

పంచాయతీ కార్యాలయాల నిర్మాణానికి రెవెన్యూ అధికారులు ప్రభుత్వ స్థలం చూపించక పోవటంతో కొత్త పంచాయతీల భవనాల పనులు ప్రారంభం కాలేదు. రాచపల్లి, బీసీ మర్రిగూడెం పంచాయతీ భవన నిర్మాణ పనులు ప్రారంభించిన స్థల వివాదంలో ప్రారంభ దశలోనే నిలిచిపోయాయి. ఇప్పటికైనా అధికారులు పంచాయతీ భవన నిర్మాణాలకు స్థలం కేటాయించి భవన నిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.


ప్రభుత్వ భవనంలో నిర్వహిస్తున్న బీసీ మర్రిగూడెం పంచాయతీ కార్యాలయం

పనులు ప్రారంభిస్తాం..

మండలంలో కొత్తగా ఏర్పాటైన తొమ్మిది పంచాయతీలకు ఉపాధిహామీ నిధులు, ఐటీడీఏ నుంచి నిధులు మంజూరయ్యాయి. పంచాయతీ భవన నిర్మాణాలకు ప్రభుత్వ స్థలం లేక పోవటంతో పనులు నిలిచిపోయాయి. కొన్ని భవనాల నిర్మాణానికి కాంట్రాక్టర్లు ముందుకు రావటం లేదు. స్థలం సేకరించి భవన నిర్మాణ పనులు ప్రారంభిస్తాం.



– హనుమంతరావు, ఎంపీఓ

చట్టాలపై చైతన్యం కీలకం

నర్సంపేట : చట్టాలపై ప్రజల్లో చైతన్యం కీలకమని వినియోగదారుల మండలి హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ప్రొఫెసర్ రతన్‌సింగ్ స్పష్టం చేశారు. పట్టణంలోని విజ్‌డమ్ హైస్కూల్‌లో డైరెక్టర్ జావెద్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సదస్సుకు ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. వినియోగదారులు నాణ్యమైన వస్తువులు, సరుకులు మాత్రమే కొనుగోలు చేయడాన్ని హక్కుగా భావించాలని సూచించారు. వినియోగదారులకు పరిహారం పొందే హక్కు సైతం ఉంటుందని తెలిపారు. మండలి వరంగల్ జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్ మాట్లాడుతూ కొనుగోలు చేసే సమయంలో నాణ్యతలో తేడా ఉంటే వెంటనే సమాచార, పౌర సరఫరాల శాఖ కమిషనర్‌కు అందజేయాలని సూచించారు.

పోస్టల్ స్కాలర్‌షిప్‌నకు ఎంపిక

నర్సంపేట : జాతీయ పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో అమలు అవుతున్న దీన్ దయాల్ స్పర్శ్ యోజన స్కాలర్‌షిప్‌కు పట్టణంలోని విజ్‌డమ్ హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆ శాఖ నర్సంపేట ఇన్‌స్పెక్టర్ సుచేందర్‌రావు, స్కూల్ ప్రిన్సిపాల్ జావెద్ విద్యార్థులను శుక్రవారం అభినందించి మాట్లాడారు. స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న స్పందన, మామిడాల యశ్వంత్, ఏడో తరగతి విద్యార్థులు అసద్, షహజాద్, కొప్పు యశ్వంత్, సుశాంత్, రాజు, భవ్యశ్రీ, రిషిత వివిధ అంశాల్లో జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రాజెక్టులను సమర్పించి స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారని చెప్పారు. ఎంపికైన విద్యార్థులకు ప్రస్తుత విద్యాసంవత్సరానికి గాను నెలకు రూ.500 చొప్పున స్కాలర్‌షిప్ అందించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు ప్రతిభ కనబర్చి స్కాలర్‌షిప్‌కు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ జహంగీర్, అకడమిక్ అడ్వైజర్ నాజియా ఇక్బాల్, వైస్ ప్రిన్సిపాల్ ప్రకాశ్ ఉన్నారు.

టేకుమట్ల: హోలీ వేడుకల్లో మహిళలు



మల్హర్: ఎడ్లపల్లిలో హోలీ ఆడుతున్న చిన్నారులు



టేకుమట్ల కృష్ణకాలనీలో హోలీ వేడుకల్లో చిన్నారులు



మహదేవపూర్‌లో..



ఉత్సాహంగా హోలీ వేడుకలు

జిల్లా వ్యాప్తంగా హోలీ వేడుకలను చిన్నాపెద్దలతో పాటు యువత, మహిళలు శుక్రవారం ఘనంగా నిర్వహించుకున్నారు. వివిధ రంగులు చల్లుకొని ఒకరికొకరూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్


చిట్యాల: ఉపాధిహామీ పనుల వద్ద హోలీ వేడుకల్లో పాల్గొన్న ఏపీఓ జమీర్‌పాషా, కూలీలు


మల్హర్: హోలీ సంబురాల్లో కొయ్యూరు వాసులు


రేగొండలో..


చిట్యాలలో..


గణపురంలో..


కొత్తపల్లిగోరిలో..


మహదేవపూర్‌లో..


భూపాలపల్లి అర్బన్: రెడ్డి కాలనీలో..


టేకుమట్ల: అంబేడ్కర్ సెంటర్‌లో..


టేకుమట్ల: పోలీస్‌స్టేషన్‌లో..


కాటారం పోలీస్ స్టేషన్‌లో..


కాళేశ్వరంలో రంగులతో యువత సంబురాలు

వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా

- డీఈ ఆనందం

నర్సంపేట రూరల్ : వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయనున్నట్లు ఆ శాఖ డీఈ (టెక్నికల్) ఆనందం తెలిపారు. నర్సంపేట మండలంలోని గుంటూరుపల్లిలో ఆ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు విద్యుత్ సరఫరాలో చోటు చేసుకుంటున్న పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం డీఈ ఆనందం మాట్లాడారు. రైతులు వ్యవసాయంలో ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని చెప్పారు. వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేయడంలో లోటుపాట్లు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకుంటూనే సమస్యలు తెలుసుకునే దిశగా పొలంబాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.


మాట్లాడుతున్న డీఈ ఆనందం

17న కనకదుర్గ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన

వాజేడు: మండల కేంద్రంలో ఈ నెల 17న కనకదుర్గ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రతిష్ఠాపన కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం అమ్మవారి విగ్రహాన్ని మండల కేంద్రంలో ఊరేగింపు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


ఊరేగిస్తున్న గ్రామస్తులు